Eenadu - Dt: 23/10/2017

# మెట్రో భద్రత పోలీసు శాఖకే

- ఐజీ స్థాయి అధికారికి బాధ్యతలు

ఈనాడు, హైదరాబాద్: త్వరలో ప్రారంభం కానున్న మెట్రో రైలు భద్రతపై స్పష్టత వచ్చింది. మొదట్లో ప్రత్యేక భద్రతా దళం (ఎస్పీఎఫ్)కు మెట్రో భద్రతా బాధ్యతలు అప్పగించాలని భావించినప్పటికీ తర్వాత ఆ ప్రతిపాదన విరమించుకున్నారు. తాజాగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోనే మెట్రో రైలుకు భద్రత కల్పించాలని, ఒక ఐజీ స్థాయి అధికారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతోంది. వచ్చే నెలాఖరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా మెట్రో రైలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నిత్యం లక్షలాది మంది ప్రయాణించే మెట్రో రైలుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రమూకల ఆయా నగరాల్లోని మెట్రో రైళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న నేపథ్యంలో నగరంలో ప్రారంభం కాబోతున్న మెట్రో రైలుకు పటిష్ఠమైన భద్రత కల్పించాలని ప్రాజెక్టు రూపకల్పన సమయంలోనే ప్రతిపాదించారు. దిల్లీ మెట్రో రైలు భద్రతా బాధ్యతలను విమానాశ్రయాలకు భద్రత కల్పించే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) పర్యవేక్షిస్తుంటుంది. ఇదే తరహాలో హైదరాబాద్ మెట్రో బాధ్యతలను ఎస్పీఎఫ్‌కు అప్పగించాలని భావించారు. తర్వాత ఆ ప్రతిపాదన విరమించుకున్నారు. చాలాకాలంపాటు దీనిపై చర్చ జరగలేదు. ప్రారంభోత్సవానికి సమయం దగ్గరపడుతుండడంతో ఇప్పుడు మెట్రో భద్రతపై పోలీసులు దృష్టి సారించారు. దీనికి సంబంధించి డీజీపీ అనురాగ్‌శర్మ ఆధ్వర్యంలో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. పోలీసు శాఖ ఆధ్వర్యంలోనే భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని, ఒక ఐజీ స్థాయి అధికారిని ఇందుకోసం ప్రత్యేకంగా నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది సిబ్బందిని నియమించాలి? భద్రతాపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై కసరత్తు జరుగుతోంది. ఈ నెలాఖరులోగా విధివిధానాలు రూపొందించే అవకాశం ఉంది.